
# తొలకరి చినుకు

- కోరం రాజబాబు



**పదిరోజులుగా ఒకే ఒక దృశ్యం. అదే నాలా ఒంటరిగా ఉన్న ప్రకృతి. నాకు తోడుగా... నాలో ఒకటిగా మసకచీకటితో ముచ్చటిస్తూ మౌనంగా... గంభీరంగా రోధిస్తుందో... రగులుతుందో... తెలియని నాలో ఏదో నిర్లిప్తత. ఎందుకు? అలా ప్రశ్నించుకోవడంకూడా నాకు నచ్చలేదు. ఇప్పటికి ఎన్నిసార్లు? అలా సంభాషించుకోటానికి నాకు ప్రకృతే తోడైంది. నా పరిస్థితి... నాలో అంతర్లీనంగా దాగిన ప్రకంపనాలు... వీటిని ప్రకృతితో ముడివేయడం దేనికి? నా మానసికస్థితిని ముసుగేసి కప్పేయడానికేగా!**

అపుడు నవ్వొచ్చింది. ఎంత సంఘర్షణ మనిషికి?... కేవలం తెలివితేటలున్న ఒకజీవికి... అలా అలోచించుకుంటూ కూర్చున్నాను.

ట్యాంక్‌బండ్‌పైని విద్యుత్‌దీపాలు కాంతిని విరజిమ్మసాగాయి. అపుడపుడూ వచ్చే వాహనాలు క్రమేపి పలచబడ్డాయి. అర్ధరాత్రి దాటిందనుకుంటాను. టైం ఎంతయ్యిందో? నా వాచీ ఎపుడో పాడయ్యింది. రిపేర్‌కిచ్చాను. అది తిరిగి వస్తుందో రాదో... నిజానికి ఆ విషయం ఎపుడో మర్చిపోయాను. అయినా అవసరం వచ్చినపుడు కదా, దాని విలువ తెలిసేది. విలువైన ఎన్నిటినో వదులుకున్నపుడు వాచీ గురించి గుర్తెందుకొస్తుంది. ఆలోచనల్ని చేధిస్తూ ఆకాశంలో ఓ చిరు మెరుపు. టప్‌మని అపుడే నాముఖం మీద పడిన వానచినుకుతో ఆకాశంలోకి చూశాను. ఆకాశమంతా మబ్బు కమ్మేసింది. ఇన్నిరోజులూ ఎండలు వేధించాయి. ఇది తొలకరి మబ్బులా ఉంది. అసలు వీటిగురించిన ఆలోచనలు నాకెందుకు? నా గమ్యం వేరుకదా! అయితే... నా ఆలోచనలు ఎంచుకున్న గమ్యంవైపు వెళ్లకుండా నన్ను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

వానచినుకుల సైజు పెరిగింది. గాలికూడా ఉధృతమవుతున్నట్లనిపించింది. చెట్లు వేగంగా తలలు ఊపుతున్నాయి. నేను దాదాపు తడసి పోయాను. ఇన్నాళ్ల వేసవి తాపానికి ఇపుడు ఇలా తడవడం- ప్రాణానికి హాయిగా ఉంది. ప్రాణం అంటే గుర్తొచ్చింది. నా ప్రాణం నాకెంతో ఇష్టమని తెలిసిపోయింది ఇపుడు. ఎవరిప్రాణం వారికి ఇష్టమయినదే. కాని నా విషయంలో ఇలా చెప్పడంలో ఒక ప్రత్యేకత ఉంది.

వళ్లంతా తడిసినా చలిలేదు. నాలో ఏదో అలజడి.. మోకాళ్లమీద తలాన్చి కూర్చున్నాను. వర్షం జోరు తగ్గిందిగాని చినుకులు పడుతూనే ఉన్నాయి. గమ్యం లేనపుడు అలా నడుస్తూపోవాలని ఎక్కడో చదివాను. నిస్సహాయత, అసమర్థత, పిరికితనం ఇవన్నీ నన్ను నిలవనీయడంలేదు. ప్రతీ చర్యా నా ప్రమేయం లేకుండా జరిగిపోతున్నది.

ఆకాశంలో వేగంగా కదులుతున్న మబ్బుల్లా నా ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. వాన కాస్త తగ్గింది. ట్యాంక్‌బండ్ అంతా నీటితో కడిగినట్టుంది. కూర్చున్నచోటే ఎంతసేపని కూర్చుంటాను. అలా ట్యాంక్‌బండ్ చివరికంటూ చూశాను. దూరంగా ఎవరో వస్తున్నట్టుంది. అస్పష్టంగా ఆ ఆకారం... నేనైతే వీసమెత్తు కదల్లేదు గాని నాలో ఉత్సుకత... నా ఆలోచనలు వాటంతట అవే ఆగిపోయాయి... తీక్షణంగా అటే చూశాను. అనుమానంలేదు. వచ్చేది స్త్రీ మూర్తే. ఆమె నడకలో ఏమాత్రం బెదురు లక్షణాలు లేవు. ఇంత రాత్రివేళ ఒక స్త్రీ ఒంటరిగా అలా రావడం... నాలో ఏదో ఆత్రుత... నేను పైకి లేవాలనుకుంటుండగానే ఆమె దగ్గరగా వచ్చేసింది. నన్ను చూసిందో లేదో? నన్ను దాటుకుని వెళ్లింది. అలా ముందుకెళ్లి చుట్టూ ఓసారి చూసింది. ఆ తర్వాత ఆమె చూపులు బుద్ధ విగ్రహంవైపే నిలిచినట్టు నాకు స్పష్టంగా కనిపించింది.

వాన తగ్గినట్టే తగ్గి మళ్లీ మొదలయింది. నెమ్మదిగా కళ్లముందు స్పష్టత పోయింది. లీలగా కనిపించసాగింది. కాసేపటికి ఆమె ముందుకు కదిలింది. ఆమెనే గమనిస్తున్న నేను పైకి లేచి వేగంగా ఆమె దిశగా అడుగులేశాను. ఆమెను పట్టుకోవాలి. వేగంగా పడుతున్న నా అడుగుల చప్పుళ్లకు ఆమె నడక ఆపి వెనక్కి చూసింది. నేను

ఆమెదగ్గరగా వెళ్లాను. విద్యుత్‌కాంతిలో ఆమె చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. చక్కని రూపు. చూపులు అమాయకంగా సూటిగా ఉన్నాయి.

ఆమెనెలా పలకరించాలో నాకర్థం కాలేదు. కాసేపు మౌనంగా చూస్తూండిపోయాను. ఆమె ఏం అనుకుందో నావేపు రెండడగులు వేసింది. దాంతో నేను కన్ఫ్యూజ్ అయ్యాను.

"మీరెవరు? ఎందుకు నన్ను ఫాలో అవుతున్నారు?" నావైపే చూస్తు అడిగిందామె సూటిగా.

అది నేను ఊహించని సంఘటన. మరింతగా తడబడిపోయాను. జవాబివ్వలేకపోయాను. తేరుకుని...

"ఇంత అర్ధరాత్రి మీరు ఇక్కడి కెందుకొచ్చారా అని... అడగడానికే మీ వెనక నడిచాను. ఇలా కూర్చుని చెప్పండి. మీకు కష్టంగా అనిపిస్తే వద్దు".

"కష్టనష్టాలగురించి ఆలోచించడం మరిచిపోయాను."

"మీపేరు ఊరు గురించి అడగను కాని ఇక్కడికి ఎందుకు వచ్చారోనని ..."

"అదేమిటి? నేనిక్కడికి రావడం తప్పా? నేను ఆడదాన్నయి, ఒంటరిగా వచ్చినందువల్లే ఈ ప్రశ్న అడుగుతున్నారనుకుంటాను. ఇలా నేను రాకూడదంటారా?"

"ఎందుకు రాకూడదు? మీకూ బోలెడంత స్వేచ్ఛ ఉంది.. అర్ధరాత్రి ఆడది ఒంటరిగా తిరిగినపుడే ఆడదానికి నిజమైన స్వాతంత్ర్యం అన్నారు కదా? మిమ్మల్ని అలా అడిగి బాధపెట్టినట్టున్నాను. కాని నాకు మిమ్మల్ని ఇలా అడగడం తప్పనిపించడం లేదు. తప్పంటారా?"

"అవునూ... మీ అభిప్రాయాలతో నాకు పనేంటి? వెళుతున్న నన్నాపి మీరడగడం... నేను నిలిబడిమరీ మీకు జవాబివ్వడం..."

"దీనిగురించి కాదండి. మిమ్మల్ని దూరంగా చూసి ఏ ఆత్మహత్యా ప్రయత్నమో అనుకున్నాను. మిమ్మల్ని ఆపుదామనుకున్నాను. దగ్గరగా చూసి.. ఏదో కుతూహలం... అభ్యంతరం లేకుంటే చెప్పండి ఎవరిమీదన్నా అలిగి వచ్చారా?" నా గొంతులో ఏదో వేడికోలు.

"ప్రత్యేకతేం లేదు. నేనో ఒంటరిపక్షిని."

"అంటే మీకెవ్వరూ లేరా?"

"ఉన్నారు."

"మరి.."

"అది నా మనసుకుచెందినది. ఆ సమస్యలు బోలెడు. మీకిపుడవి చెప్పను. నేను మాత్రం ఇక్కడికి ఆత్మహత్య చేసుకోవాలనే వచ్చాను."

"మరి తిరిగి వెడుతున్నట్టున్నారు... భయం వేసిందా?"

"ఛ!...ఛ! భయపడే దాన్నయితే ఇంతవరకూ వచ్చేదాన్నే కాదు. ఇక్కడకొచ్చిన తరువాత నాలో కొత్త ఆలోచనలు... సమస్యలు కొత్త కోణంలో కనిపించాయి. అందుకు నాలోని పిరికితనం కారణం అని మీరనుకోవచ్చు. కాని ... నాలో చిన్న ఇన్స్పిరేషన్. ఎంత అనుకున్న మనిషి జీవితం విలువైనదే కదండి. మన జీవితంలో ఎన్నో కుళ్లు సంఘటనలు మనమే భరించలేనివి ఉంటాయి. అవి మనను ఎన్నో రకాలుగా బాధిస్తూండవచ్చు. అయినా అలా అని మనం చావాలా? చాలా చిన్న ప్రశ్న . కాని నాలో ఎన్నో ప్రకంపనాలను పుట్టించగల ప్రశ్న. గుచ్చిగుచ్చి గుండెల్ని చీల్చే ప్రశ్న. అదే ... బుద్ధుడు నన్నడుగుతున్నట్ల నిపించిందండీ! అందుకే తిరిగి వెళ్లిపోతున్నాను. పిరికితనంతో మాత్రం కాదు.. జీవితం విలువ తెలుసుకుని..వెళుతున్నాను.

"నేను చాలా చెప్పాను. మరి మీ గురించి చెప్పండి. నన్ను మీరడిగినట్లు అర్ధరాత్రి ఎందుకొచ్చారులాంటి ప్రశ్నలడిగి మీ పురుషాధిక్యాన్ని ప్రశ్నించనులేండి. "

"ఇంకా ఎందుకండీ చచ్చినపామును మరీ కొట్టబోవడం.. నేను ఎందుకూ పనికిరాని వాడిని. పిరికి వాడిని. ఆత్మహత్య చేసుకోవాలని పదిరోజులుగా ఈ ట్యాంక్‌బండ్‌ను ఆశ్రయిస్తూ చావలేకపోయాను. కనీసం మీలా నిర్ణయం తీసుకోలేకపోయాను. అంటే నేనెందుకూ పనికిరాని వాడిననేగా.."

"అలా అనకండి. మీ సమస్యలెలాంటివో? "

"చూడండి మేడమ్!"

"నా పేరు అనిత!"

"మిమ్మల్ని పేరుపెట్టి పిలవచ్చా?"

"అందుకేగా పేరు చెప్పింది. మీ పేరు..?"

"సంజీవ్!"

"అబ్బ! ఎంతమంచిపేరు. అంత గొప్పపేరు పెట్టుకుని ఆత్మహత్య దేనికండి. సరే వెళ్దామా?"

ఇద్దరం అలా నడుచుకుంటూ ట్యాంక్‌బండ్ చివరిదాకా వచ్చేశాం.

"అనితగారూ..మీలో ఏదో ప్రత్యేకత ఉందని, చాలా బాగున్నారని చెప్పాలనిపించింది. చెప్పేస్తున్నాను."

"నేను నల్లగా ఉన్నాను కదా?"

"నలుపెందుకవుతారు... చామన ఛాయ!"

"ఇక్కడకూడా మీ దృష్టి..రూపాన్ని గమనించిందన్నమాట!"

"ఏమో! అవునూ ఇంతకి మనం మళ్లీ కలుసుకుంటామంటారా?"

"కలుస్తామని ఎలా అనుకుంటారు? అయినా మన పరిచయం ఇప్పటిదే కదా. మళ్లా కలవడమేమిటి?"

"ఏమో! నాకలా అడగాలనిపించింది.."

"ఏమో, మీ ఊతపదమా?"

"కాదుగాని. మిమ్మల్ని చూస్తూంటే మాటలు... ఇంతకీ అసలు విషయం చెప్పలేదు."

"తప్పక కలుస్తాం!"

"ఎపుడంటారు?" నాలో ఆత్రుత.

"రేపే... సాయంత్రం అయిదుగంటలకు. అంతేకాదు. ఈసారి మన కలయిక మరోలా ఉంటుంది."

"మరోలా అంటే...?"

"ఈ తొలకరి చినుకుల్లా.." ఆ పెదవులపై సన్నటి నవ్వు.

సరిగ్గా అపుడే? ఆకాశంలో సన్నటి మెరుపు తళుక్కుమంది. ఆ వెలుగులో బుద్ధుడిని చూస్తే నవ్వుతున్నట్టే ఉంది. ■

## నూత్నవత్సర వాంఛా మే

**య**స్యా అధీశ్వరో ధర్మో
న్యాయశాస్త్రం చమూపతిః
పూతః ప్రేమా మహామంత్రీ
ద్రష్టు మిచ్ఛామి తద్భువమ్.
**కా**మక్రోధా ద్యమిత్రాస్తు
కారాగృహేషు బంధితాః
ఆజైవాత్మక తారార్కం
ద్రష్టు మిచ్ఛామి తద్భువమ్.
**నో** దృశ్యతే తు యస్యాం హి
స్వల్పా వాపి కృతఘ్నతా
కృతజ్ఞతాస్తి బాహుళ్యం
ద్రష్టు మిచ్ఛామి తద్భువమ్.
**సు**శీలా యత్ర నారీ భో
తథా యత్ర చ పూజ్యతే
పుమా నేకసతీ దీక్షః
ద్రష్టు మిచ్ఛామి తద్భువమ్.
**గు**రుదేవా స్తథామాతృ
పితృదేవా గుణాన్వితాః
యస్యాం తు సంతి సర్వత్ర
ద్రష్టు మిచ్ఛామి తద్భువమ్.
**క**రోతి తద్యదుక్తం హి
తత్తు వక్తి హి యత్కృతం
యస్యామహో నరోనిత్యం
ద్రష్టు మిచ్ఛామి తద్భువమ్.

కనమలూరు వెంకటశివయ్య ■